ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికారు. మొదట వీరు ప్రత్యేక రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి న్యాయస్థానం సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, ఆలయ ఏఈవో సతీష్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు చెవిరెడ్డి పరామర్శ

విశాలాంధ్ర - తిరుపతి :ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దామలచెరువు బాబూ ప్రసాద్ రెడ్డిని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పరామర్శించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇంటి వద్దనే వుంటున్న బాబు ప్రసాద్ రెడ్డి ఇంటికి శనివారం చేరుకున్న చెవిరెడ్డి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. చెవిరెడ్డి తన నియోజకవర్గ ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడిన బాబు ప్రసాద్ రెడ్డి రాజకీయాల్లో నీ వంటి సేవాగుణం కలిగిన వ్యక్తి చాలా అరుదుగా ఉంటారని అభినందనలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెడుతున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి బాబుప్రసాద్ రెడ్డికి చెప్పడంతో తప్పకుండా విజయం సాధిస్తాడని, తన మద్దతు ఎల్లప్పుడూ నీకే ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

టీటీడీకి బస్సు విరాళం

విశాలాంధ్ర -తిరుపతి: శ్రీవారికి శనివారం ఒక బస్సు విరాళంగా అందింది. చెన్నైకి చెందిన అశోక్ లేలాండ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రెసిడెంట్ శ్రీ సంజీవ్ కుమార్ దంపతులు రూ.31 లక్షల విలువైన బస్సును అందజేశారు. ఈ మేరకు శ్రీవారి ఆలయం ఎదుట వాహనం తాళాలను ఈవో శ్రీ ఏవి ధర్మారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల డిఐ జానకిరామరెడ్డి, అశోక్ లేలాండ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకునేందుకే అభిమాన సంఘం

గూడూరులో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - గూడూరు : అల్లు అర్జున్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం, సేవా కార్యక్రమాలతో పాటుగా ఆపదలో ఉన్న అభిమానులను ఆదుకునే ముఖ్య ఉద్దేశంతో అల్ ఇండియా అల్లు అర్జున్ ఫాన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటైందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదినం సందర్భంగా శనివారం అల్లు అర్జున్ ఫ్యాన్స్ అండ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సౌజన్యంతో గూడూరులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా గత కొన్నేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అందులో భాగంగా ఈ ఏడాది కూడా మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు నిర్వహించమన్నారు. సేవా కార్యక్రమాలకు సహకరించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లుతెలిపారు. ఈకార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు గంగాధర్, పూర్ణచందు, ప్రశాంత్, హర్షవర్ధన్, హేమంత, మణికంత, కార్తిక్, శివకుమార్, సుమంత్, వెంకటేశ్వర్లు, శివగనేష్, చందు, అఖిల్, లోకేష్, అసునితల్, శ్రీసాయి, అఖిల్, అఖిలేష్ కుమార్‌పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో భోజనం పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శ్రీ వెంకయ్యస్వామి పీఠం గాలిపాలెం, మెదనూరు సురేష్ రెడ్డి ఆయన సతీమణి శాంతిల సహకారంతో భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి నెల రెండో శనివారం రోజున చేస్తున్న ఈ అన్నదాన కార్యక్రమాన్ని మా సంస్థ సభ్యుడైన మెదనూరు సురేష్ రెడ్డి దంపతుల దాతృత్వంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాము, కుమార్ నాయుడు, పిల్లిల శీను, నాగరాజు, కృష్ణారెడ్డి, శ్రీను, సతీష్, నిర్వాహకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనం కోసం 40 గంటలు

తిరుమలలో కొనసాగుతున్న యాత్రికుల రద్దీ - టీటీడీ విస్తృత ఏర్పాట్లు

విశాలాంధ్ర- తిరుపతి: తిరుమలలో భక్తుల రద్దీ శనివారం ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూ లైన్లు కొనసాగుతున్నాయి. వరుస సెలవులతో పాటు వారాంతపు రద్దీతో దేశం నలుమూలల నుండి తిరుమలకు వచ్చిన భక్తులతో పోటెత్తింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, త్రాగు నీరు అందించేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. శ్రీవారి సేవకులు అన్నప్రసాదం, ఆరోగ్య, విజిలెన్స్ విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని కీలక ప్రదేశాల్లో సేవలందిస్తున్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలోనే మధ్యాహ్ననికి దాదాపు 79 వేల మందికి పైగా అన్న ప్రసాదం అందించగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూలైన్లలో 80 వేల మందికి అన్నప్రసాదాలు (ఇందులో ఉప్మా, పొంగల్ ఉన్నాయి) పంపిణీ చేశారు. సాధారణం కంటే రెట్టింపుగా అన్న ప్రసాదాలు అందించారు. అంతే కాకుండా పిల్లలకు పాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. క్యూ లైన్లలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 50 వేల మంది యాత్రికులు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ ఎస్ డి టోకెన్లు, దివ్య దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి ఆదేశాల మేరకు, జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, ఆరోగ్యం, అన్నప్రసాదం, విజిలెన్స్, వైద్య శాఖల ఉన్నతాధికారులు భక్తుల సౌకర్యాలను, క్యూ లైన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

అమ్మవారి సేవలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర - తిరుపతి : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి శనివారం సాయంత్రం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం అర్చకులు డాక్టర్ జవహర్ రెడ్డికి శేషవస్త్రం అందించి ఆశీర్వదించారు. డిప్యూటీ ఈవో అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ శ్రీ వెంకట రమణా రెడ్డి, టీటీడీ జేఈవో శ్రీ వీరబ్రహ్మం, జాయింట్ కలెక్టర్ శ్రీ బాలాజీ, ఆర్డీవో శ్రీ కనక నరసా రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెంట ఉన్నారు.

వారపు సంతలో 'చెవిరెడ్డి ఉచిత భోజనం' ప్రారంభం

- రైతులకు స్వయంగా వడ్డించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి
తమ ఆకలి తీర్చిన చెవిరెడ్డి చల్లగా ఉండాలంటూ దీవెనలు

విశాలాంధ్ర - తిరుపతి : కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు వారపు సంతలకు వచ్చే రైతులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు, కొనుగోలు దారుల ఆకలి తీర్చేందుకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వారపు సంతల్లో ఉచిత భోజనం పంపిణీని శనివారం నుంచి ప్రారంభించారు. పాకాల మండలం దామలచెరువు వారపు సంతకు చేరుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి సంతలో కాయగూరలు అమ్ముకునే రైతులు, అక్కడి వ్యాపారులతో మాట్లాడి అక్కడ పడుతున్న ఇక్కట్ల గురించి తెలుసుకున్నారు. వారపు సంతల్లో రైతులకు ఎండ తీవ్రత లేకుండా చల్లటి పట్టలను వేయించాలని, అలాగే పరిశుభ్రతను పాటించాలని అక్కడి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం వారపు సంతలో 'చెవిరెడ్డి ఉచిత భోజనం' కేంద్రాన్ని ప్రారంభించి అక్కడి రైతులు అందరికీ ఆయనే స్వయంగా భోజనం వడ్డించారు. చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా వారపు సంతలు జరిగే ప్రతిచోట ఉచితంగా భోజనం అందించేలా చర్యలు తీసుకున్నామని అందులో భాగంగనే దామలచెరువులో ప్రారంభం చెసినట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి స్పష్టం చేశారు. అనంతరం ఉచిత భోజనం తీసుకున్న పలువురు వ్యాపారులు, రైతులు, కొనుగోలు దారులు పరిశుభ్రంగా రుచికరంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే చంద్రగిరి, పూతలపుట్టు, పుంగనూరు నియోజకవర్గాల నుంచి వారపు సంతకు వచ్చే పూలు, పండ్లు, కాయగూరలు, వంట సరుకులుతో వచ్చే విక్రయదారులు భోజనం లేక ఆకలితో అలమటించే వారమని, చెవిరెడ్డి పుణ్యమాని రుచికరమైన భోజనం అందుతోందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారపు సంతలో పంటను అమ్ముకునేందుకు వచ్చిన తమ ఆకలి తీర్చిన చెవిరెడ్డి చల్లగా నూరేళ్లు బ్రతకాలని పలువురు రైతులు తలపై చేయి పెట్టి దీవించడం విశేషం. వారపు సంత జరిగే ప్రాంతంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నిరంతరాయంగా భోజనం పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం శాశ్వతంగా రేకులతో షెడ్లు కూడా వేయించేలా బాధ్యత తీసుకుంటున్నామ న్నారు. 12 రకాల వంటలతో భోజనం: అన్నదాతల ఆకలి తీర్చేందుకై ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వారపు సంతల్లో చేపట్టిన ఉచిత భోజనం సరఫరాకు తొలి రోజున విశేష స్పందన లభించింది. 12 రకాల వంటకాలు (వెజిటబుల్ రైస్, ఆనియన్ రయిత, కుర్మా, వడ, స్వీటు, కోడిగుడ్డు, అన్నం, పప్పు, సాంబార్, రసము, అరటిపండు, ఐస్ క్రీమ్) లతో రుచికరమైన భోజనం పంపిణీ చేయడం పట్ల రైతుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

జగనన్నను ఆశీర్వదించండి

- జేసి ఎస్ కన్వీనర్ ఒట్టూరు కిషోర్ యాదవ్

విశాలాంధ్ర - దొరవారిసత్రం : సీఎం జగనన్నను ప్రజలంతా ఆశీర్వదించాలని నాయుడుపేట మండల జెసిఎస్ కన్వీనర్ ఒట్టూరు కిషోర్ యాదవ్ కోరారు. జగనన్నే మా భవిష్యత్తు,మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్ర మాన్ని వైసిపి శుక్రవారం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం నాయుడుపేట మండలంలోని కలిపేడు సచివాలయ పరిధిలో మండల జెసిఎస్ కన్వీనర్ ఒట్టూరు కిషోర్ యాదవ్ స్థానిక వైసిపి నాయకులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక వైసిపి నాయకులతో కలిసి ప్రతి గడపకు వెళ్లి తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ,వారి ఇళ్లకు స్టిక్కర్లను అంటించి,సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుందని అన్నారు. పథకాలందని వారు వివరాలు తెలియజేస్తే వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గృహ సారధులు భాస్కర్,రమణయ్య, కన్వీనర్ పవన్ కుమార్,రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

"జగనన్నే మా భవిష్యత్తు"

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 27డివిజన్ మల్లయ్య గుంటకట్ట లో శనివారం ఉదయం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ డాక్టర్ శిరీషమే యర్ డాక్టర్ శిరీష స్వయంగా వార్డులోని ఇళ్లను సందర్శించి వారితో కాసేపు మాట్లాడి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ,ఆ సంక్షేమ పథకాలు వారి కుటుంబానికి ఏవేవి వస్తున్నాయో కనుక్కుంటు ఈసారి కూడా మన జగనన్నకు మీ సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. అనంతరం వారి ఇంటికి "మా నమ్మకం నువ్వే జగన్" అనే స్టికర్ ను అతికించి ముందుకు సాగారు మేయర్ .మేయర్ మాట్లాడుతూ 2024 లో కూడా జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డులోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు భరణి యాదవ్, తులసి, సురేష్, రమేష్, గీతా యాదవ్,వెంకట ముని, కార్యకర్తలు,వార్డ్ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కోదండరాముడి చక్రస్నానం

- రాత్రి ధ్వజావరోహణంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - తిరుపతి :ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరో హణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో నటేష్ బాబు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

భాషా చైతన్యం కొరవడిన దైన్యస్థితిలో తెలుగుజాతి

విశాలాంధ్ర - తిరుపతి : ఒకనాడు తెలుగు ప్రజల భాషా చైతన్యం వల్ల దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని నేడు ఆ భాషా చైతన్యం కొరవడిన దైన్యస్థితిలో తెలుగుజాతి వుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి. తులసీనాథం నాయుడు ఆవేదన వెలిబుచ్చారు. శనివారం ఉదయం స్థానిక సింధూరి పార్క్ హెూటల్‌లో జరిగిన తెలుగు భాషోద్యమ సమితి 17 వ వార్షికోత్సవ సభలో ముఖ్య అతిథిగ పాల్గొని ప్రసంగిస్తూ ఆయన గొప్ప చరిత్ర కలిగిన తెలుగు భాషను ఆధునిక కాల అవసరాలకు అనుగుణంగ అభివృద్ధిపరచడంలో మనం బాగా వెనుకబడుతున్నామని ఆందోళన వ్యక్తపరిచారు .అతిథులుగ పాల్గొన్న ప్రముఖ రచయిత రాసాని,విశ్వశ్రీ సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గార్లపాటి దామోదరం నాయుడు, ఈతరం కవితా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు -బడి పిల్లలకు ఉపయుక్తంగ ప్రాథమిక పరిజ్ఞానంతో సమితి కూర్చిన' తెలుగు బాల ' బ్రోచర్ ను సభలో ఆవిష్కరించి తెలుగు భాషా పరిరక్షణ కర్తవ్యం గురించి ప్రసంగించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు అభ్యాసం చేయడం కోసం 30 ఉన్నతపాఠశాలల్లో ' తెలుగు బాల'పంపిణీ చేస్తున్నామని సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్సులు గంగవరం శ్రీదేవి, టెంకాయల దామోదరం చెప్పారు. సమితి ప్రతినిధులు వాకా ప్రసాద్,డా. తమటం రామచంద్రా రెడ్డి,డా. పొక్కళ్ల సుభద్ర,ఆముదాల మురళి, ఆకుల మల్లేశ్వర రావు, బొందు రామచంద్రా రెడ్డి, మునిసిద్దారెడ్డి, ఎం. చంద్రా రెడ్డి జె. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు

బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రేణుకమ్మ మృతి

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు రేణుకమ్మ శనివారం ఉదయం మృతి చెందారు. గత కొంతకాలంగా హెచ్‌ఎం రేణుకమ్మ క్యాన్సర్ వ్యాధి బారిన పడి చికిత్స తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రేణుకమ్మ ఆకస్మికంగా స్వగృహంలో కన్నుమూశారు. గత 34 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో సేవలు అందించారు. ఈ క్రమంలో విద్యారంగంలో ఆమె చేసిన కృషి ఫలితంగా బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల మోడల్ స్కూల్ గా ఎంపికైంది. బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రేణుకమ్మ మృతి పట్ల మండల విద్యాశాఖ అధికారి రవి, పలువురు ఉపాధ్యాయ సంఘం నేతలు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఎంఈఓ రవి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ వార్షికోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి: లిటిల్ ఏంజెల్స్ హై స్కూల్ 42వ వార్షికోత్సవ సంబరాలు తిరుపతిలో శనివారం ఘనంగా నిర్వహిం చారు. మహతి ఆడిటోరియంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష ముఖ్యఅతిథిగా హాజరై వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగి జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, అందుకు శ్రమించాలని సూచించారు. విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు వివిధ రంగాలలో తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. ఐ ఎఫ్ ఎస్ అధికారిని యశోద భాయ్ మాట్లాడుతూ లిటిల్ ఏంజెల్స్ స్కూల్ లలో చదివిన విద్యార్థులు వివిధ రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. అలాంటివారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన అమరావతి గీతం తో పాటు విద్యార్థులచే నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లిటిల్ ఏంజెల్స్ విద్యాసంస్థల అధినేత రాజగోపాల్ రెడ్డి, చైర్ పర్సన్ రమాదేవి, ప్రిన్సిపాల్ శారా స్మిత, కార్పొరేటర్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం

విలేకరులు కావలెను

విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.

పనిచేయవలసిన మండలాలు :

తిరుపతి సిటి, రామచంద్రాపురం, దక్కిలి, బాలాయపల్లి, డి.వి.సత్రం, నారాయణవనం, వడమాలపేట, నగరి, పెనుమూరు, ఎస్.ఆర్.పురం, పూతలపట్టు, తవణంపల్లి, యాదమరి, చిత్తూరు రూరల్, సదుం, సోమల, శాంతిపురం

గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి

సంప్రదించవలసిన నెంబరు: 94909 52134

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

బందార్లపల్లి పంచాయతీలో మా నమ్మకం నువ్వే జగనన్న

విశాలాంధ్ర - రామకుప్పం : మండల పరిధిలోని బంధాల్లపల్లి పంచాయతీ సెగ్మెంట్ బగల నత్తం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా పంచాయితీ సర్పంచ్ప్ రాజగో పాల్ ఆధ్వర్యంలో ఇం టింటికి తిరిగి రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి సామా న్య ప్రజల ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నామని తెలిపారు ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు పంచాయితీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్య లను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు కార్యక్రమంలో ఎంపీటీసీ కుందనందన్ రెడ్డి సచివాలయ కన్వీనర్ కేశవరెడ్డి మరియు వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దూరు నుండి అంబూరు రోడ్డు పనులకు త్వరలో టెండరు

విశాలాంధ్ర - రామకుప్పం : మండల పరిధిలోని 89 పెద్దూరు నుండి తమిళనాడు రాష్ట్రం ఆంబూరు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులకు గాను చిత్తూరు జిల్లా ఎంఎల్సీ భరత్ చొరవ తో ఇప్పటికే ఆరు కోట్ల యాభై వేల రూపాయలు మంజూరయ్యాయని ఇందుకు సంబంధించి త్వరలో టెండరు ప్రక్రియ పూర్తి కాగానే రోడ్డు పనులు మొదలు పెట్టడం జరుగుతుందని మండల వైసీపీ అధ్యక్షుడు బాబురెడ్డి కో కన్వీనర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ రోడ్డు పునర్నిర్మాణం చేపట్టనున్న ప్రాంతాల్లో పంచాయితీ రాజ్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి ఈ ఈ రమణయ్య ఏ ఈ మాధవయ్య తదితరుల తో శనివారం పర్యవేక్షించారు టెండరు ప్రక్రియ పూర్తి కాగానే రోడ్డు పనులు మొదలు పెట్టడం జరుగుతుందని తెలిపారు కార్యక్రమం లో ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మనమందరం జగనన్నకు తోడుగా నిలుద్దాం: ఎంపీపీ

విశాలాంధ్ర - పుంగనూరు: జగనన్న మన భవిష్యత్తు మన నమ్మకం మనమంతా జగనన్నకు తోడుగా నిలువుదామని ఎంపీపీ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు ఆయన శనివారం రోజున పార్టీ నాయకులు అనుబంధ సంఘాల నాయకులతో కలిసి మండలంలోని చదల పంచాయతీ బైన్ పల్లి కుమార్ నత్తం పంచాయతీలో కప్పాడ మిట్టపల్లి గుడిసిబండ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి ఆదేశాల మేరకు జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అందులో భాగంగా పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటా తిరిగి ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరించి జగనన్న మా భవిష్యత్తు మా నమ్మకం స్టిక్కర్లను ప్రజలకు ఇంటింటా అందించడం జరిగింది ఈ సందర్భంగా ఎంపీపీ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి దాదాపు 5 లక్షల నుండి 8 లక్షల వరకు అందడం జరిగిందని మేము అందించిన సంక్షేమాన్ని గురించి ప్రజలకు వివరించి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండాలని కోరుచునా న్మన్నారు రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ అందించిన వైయస్సార్ పార్టీకి మాత్రమే రాబోయే 2024 ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఉన్నదని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి యాదవ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి మాజీ చైర్మన్ నాగరాజు రెడ్డి మండల సచివాలయాల కన్వీనర్ కొత్తపల్లి చెంగారెడ్డి పార్టీ నాయకులు జై రామ్ రెడ్డి భాస్కర్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుకు తక్షణమే చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పలమనేరు : ఉద్యోగ ఉపాధ్యాయ వర్గానికి తీవ్ర మనోవేదన కలగజేస్తున్న సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం) విధానాన్ని రద్దు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బాబు రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో పలమనేరు డివిజన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బాబు రెడ్డి హాజరై మాట్లాడు తూ...అధికారంలోకి వచ్చినవారంరోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని మాట ఇచ్చి ఇంతకాలం గడు స్తున్నా రద్దు చేయకపోవడం సరికాదన్నారు. దేశంలో పంజాబ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, రాష్ట్రాలలో సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుం టున్నాయనిగుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా సిపిఎస్ విధానంలో తగు మార్పులు కోసం కమిటీ వేసిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ రద్దు కు పూనుకోకపోవడం సరికాదన్నారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి మీగడ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్రంలో 55వేల ఉపాధ్యాయ పోస్టులు దాదాపుగా కాళీ ఉంటే విద్యాశాఖ మంత్రి 1000 లోపు మాత్రమే ఖాళీలు ఉన్నాయనడం సరికాద న్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఒక డీఎస్సీ నిర్వహించక పోవడంతో ఉపాధ్యాయులపై అదనపు బారంపడుతుందన్నారు. తక్షణమే డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోయుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిపి ప్రకాష్, జిల్లా కోశాధికారి ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు గురుమూర్తి, పాపయ్య, నాగభూ షణం, పురుషోత్తం, డివిజన్ నాయకులు భాస్కరయ్య, గుణశేఖర్ రెడ్డి, నిర్మల, శశి కుమార్, నాగభూషణం, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, గిరిధర్‌గుప్తా, రాజా, తదితరులు పాల్గొన్నారు.

తులసీనాదం నాయుడుకు సత్కారం

విశాలాంధ్ర - పలమనేరు : తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసినాదంనా యుడును తిరుపతికి చెందిన తెలుగు భాషోద్యమ సమితి నిర్వాహకులు శనివారంఘనంగా సత్కరించారు. తెలుగు భాషోద్యమ సమితి 17వవార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తులసినాదంనాయుడును ఆయనచేస్తున్న తెలుగు భాషా సేవలకు గాను వార్షికోత్సవ పురస్కారంలో సత్కరించారు. తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్ష కార్యదర్శులు గంగవరం శ్రీదేవి, టెంకాయల దామోదరం, ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, ఆముదాల మురళి, వాకా ప్రసాద్, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో 10వ తరగతి పరీక్షలు

పలమనేరు విశాలాంధ్ర: పలమనేరు మండలంలో 6 పరీక్షా కేంద్రాలలో శనివారం 10వ తరగతి ఆంగ్ల పరీక్ష జరిగినది. 6 పరీక్షా కేంద్రాలలో 1327 మంది విద్యార్థులకు గాను 1306 మంది విద్యార్థులు పరీక్ష వ్రాయడం జరిగిందనారు. ఇందులో 21 మంది విద్యార్థులు పరీక్షలకు గైహాజరైనారు. అన్ని కేంద్రాలలోను విద్యార్థులకు టేబుల్స్ త్రాగు నీటి వసతి లైట్స్ ఫాన్స్ మొదలగు సౌకర్యాలు కల్పించడం జరిగిందనారు. విద్యార్థులు అందరు ప్రశాంత వాతావరణంలో పరీక్ష వ్రాయడం జరిగిందనారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని మండల విద్యాశాఖాధికారిణి పి.లీలారాణితెలియజేశారు.

దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టకపోతే

మోడీ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలకు పతనం తప్పదు

- దళితహక్కుల పోరాటసమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.నాగరాజు

విశాలాంధ్ర - తిరుపతి : దళితులపై మైనార్టీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ నగరి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక పిసిఎన్ గ్రౌండ్ నందు సీపీఐ నగిరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య అధ్యక్షతన జరిగింది రౌండ్ టేబుల్ సమావేశ ప్రాధాన్యతను సిపిఐ పార్టీ నగర్ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య నాయకులకు వివరించారు, కడప జిల్లా చనిపోయిన డాక్టర్ అచ్చన్న కుటుంబ నాదుకొని దోషలను శిక్షించాలి సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆల్ ఇండియా దళిత రేట్స్ మూమెంట్ ఏ ఐ డి ఆర్ ఎం జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్. నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి జగన్మోహన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటు దేశంలో ,ఇటు రాష్ట్రంలో దళితులపైన గిరిజనుల పైన మైనార్టీల పైన దాడులు విచ్చలవిడిగా జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దాడులు విపరీతంగా జరుగుతున్నదని త్రీవం గా విమర్శించారు అనగారిన వర్గాల బడుగు బలహీన వర్గాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు దళితుల మైనార్టీలపై జరుగుతు న్న దాడులు అత్యాచారాలు ను కుల వివక్షత జరుగుతున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గ మన్నారు దళిత మైనార్టీలపై జరుగుతున్న దాడులను అత్యాచారాలను అరికట్టకపోతే భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పతనం కాక తప్పదని హెచ్చరించారు అనేక సంక్షేమపథకాలను దళితులకు ప్రవేశ పడుతున్నామని ప్రకటనలకే పరిమితం చేస్తున్నారు తప్ప ఆచరణలో చేసింది ఏమీ లేదన్నారు నిలిపివేసిన 27 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న దాడులను తిప్పి కొట్టడానికి పార్టీలకతీతంగా ప్రజాసంఘాలకు అతీతంగా దళిత సంఘాల ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపుఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఈ నెలలో 11వ తారీఖున చలో విజయవాడకు పిలుపు ఇవ్వడం జరిగింది. కావున దళిత మైనార్టీ సంఘాలు రాజకీయ పార్టీలన్నీ చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు నగరి తెలుగుదేశం పార్టీ రూరల్ పట్టణ అధ్యక్షులు బాలాజీ రమేష్ మాట్లాడుతూ మహిళలతో పాటు ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించిన ఘనత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు దక్కిందన్నారు బడుగు బలహీన వర్గాల కోసం నిమున జాతుల కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఓటు అనే ఆయుధాన్ని ఇచ్చారని రాజ్యాధికారానికి ఓటు ఆయుధంతో శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపిమోడీ ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత దళితులపై గిరిజనులపై దాడులు విపరీతంగా జరుగుతున్న పట్టించుకోవడంలేదని విమర్శించారు రానున్న రోజుల్లో దళితులే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు సమావేశంలో సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శులు వేల న్ భాష మురళి రూప్ కుమార్ శేఖర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేస య్యు, టీడీపీ నాయకులు శ్రీధర్ ఆర్ముగం కన్నయ్య శ్రీనివా సులు మనీవా సగం సలీం సిపిఎం నాయకులు పెరుమాళ్ మైలు స్వామి అధ్యక్ష కార్యదర్శులు విజయ కుమార్ హరీష్ ఏఐటియుసి నాయకులు అహ్మద్, దళిత సంఘాల నాయకులు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈస్టర్ పండుగ మహోత్సవాలు

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు:-పులిచెర్ల మండలం కల్లూరు బీసీ కాలనీ చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చర్చి పాస్టర్ కె. ధనరాజ్ తెలిపారు ఈ సందర్భంగా ఆధ్యాత్మిక పాటలు, ఆధ్యాత్మిక సందేశము, నాటికలు జరుగుతాయని అందరూ పాల్గొని దైవ కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర -చిత్తూరు : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. శనివారం నగరంలోని 35వ వార్డు పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర కమిషనర్ జె అరుణ, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, నగరపాలక అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిం దని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు సులభంగా ఇంటి గుమ్మం వద్ద అందుతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాల్లో మహిళలకు అగ్ర తాంబూలం దక్కిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై

విశాలాంధ్ర - గంగాధర నెల్లూరు : గంగాధర్ నెల్లూరు ఎస్సైగా రామాం జనేయులు శనివారం నాడు బాధ్యతలు చేపట్టారు ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై శ్రీనివాసన్ వీఆర్‌లో ఉండగా గుడిపల్లి ఎస్సై గా పనిచేస్తున్న ఈయనను ఇక్కడికి బదిలీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ రవాణా మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు అదేవిధంగా ప్రజల కు ఎప్పుడైనా ఏ సమయంలో అయినా సేవలందించడానికి మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు.

ఉత్తర ప్రగాల్భాలూతో రాష్ట్ర ప్రజల్ని మోసం చేసిన జగన్

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షులు జంగా గౌతమ్

విశాలాంధ్ర - గంగాధర నెల్లూరు : ఉత్తర కుమారుని ప్రగాల్భాలూతో లేని పోని హామీలతో రాష్ట్ర ప్రజల్ని నాలుగేళ్ళ క్రితం ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి మోసం చేసారని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ బాబు లు అన్నారు. గంగాధర నెల్లూరులో పిసిసి మెంబర్ పోటుగారి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారివురు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీని ఎదుర్కోలేక కుంటి సాకులతో అతని పార్లమెంట్ సభ్యుని రద్దు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రాజకీయ పార్టీ నేతలపై వివిధ కేసులు ఉన్నవారు బిజెపిలో చేరితే కేసులు మాఫీ చేసే ఘనత బిజెపి ప్రభుత్వానికి దక్కిందన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో ఇతర పార్టీలకు చెందిన 170 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన ఘనత సైతం బిజెపికే దక్కిందన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆదానికి ప్రభుత్వ సొమ్ములు కట్టబెట్టడమే ధ్యేయంగా బిజెపి పని చేస్తుందని ఉద్యమ చేశారు. రాహుల్ గాంధీ సభ్యత రద్దుకు సంబంధించిన విషయంలో దేశంలో 18 పార్టీల నాయకులు దీనిపై ఖండన చేశారన్నారు అయితే ఆంధ్రప్రదేశ్ లో టిడిపి, వైసీపీ మోడీ కి భయపడి నోరు మెదకపోవడం దారుణం అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడి బీజేపీ ని సాగనంపడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సాకే శంకర్ సుబ్బరాయుడు బుల్లెట్ రవికుమార్, వరదేశి, మణి కృష్ణ ,గోవర్ధన్ రెడ్డి ,చంద్రబాబు ,నరసింహులు నాయుడు, జయచంద్ర తో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనే మా నమ్మకం స్టిక్కర్‌లు పంపిణీ ప్రారంభం

విశాలాంధ్ర -తిరుపతి : బైరెడ్డి పల్లి మండలం లక్కనపల్లి పంచాయతీ లో శెట్టి పల్లి గ్రామం లో మా నమ్మకం నువ్వు జగన్ కార్యక్రమం శనివారం ప్రారంభ మైంది. కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యదర్శి మరియు రాజం పేట పరిశీలకులు ఎం.క్రిష్ణమూర్తి ప్రారం భించారు. ఇంటింటికి స్టిక్కర్‌లు అంటించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కార్తిక్, ఉప సర్పంచ్ రాజేంద్ర, ప్రభాకర్ రెడ్డి, మరియు ఎక్స్ ఎంపీటీసీ వాసు, రఘు, గ్రామస్తులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతంకు చిన్న మొత్తాలా పొదుపు పథకం

శ్రీకాళహస్తి పోస్టల్ ఇన్స్పెక్టర్ బి.మణికండన్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : భారత ప్రభుత్వం, తపాలా శాఖలో ప్రత్యేకంగా మహిళల పెట్టుబడిలో భాగస్వామ్యాన్ని పెంచడానికి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి చిన్న మొత్తాలా పొదుపు పథకం కింద పోస్ట్ ఆఫీస్ ద్వారా 1/4/23 నుండి మహిళా సమ్మాన్ సేవింగ్ పథకం ప్రవేశ పెట్టిందని శ్రీకాళహస్తి పోస్టల్ ఇన్స్పెక్టర్ బి.మణికండన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో మహిళలు మాత్రం పెట్టుబడి పెట్టుకునే అవకాశం కలదని, ఈ పథకం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ రాబడి పొందే విదంగా సంవత్సరానికి 7.5% వడ్డీని ఇవ్వనుందని తెలిపారు. ఇందులో కనీసం 1000 నుండి గరిష్టంగా 2,00,000 రూపాయల వరకు పెట్టుబడి పెట్టుకోవచ్చునని, ఇందులో ఒక అకౌంట్ ఓపెన్ చేసిన తరువాత మరల మూడు నెలల తరువాత మరియొక్క అకౌంట్ ఓపెన్ చేసుకునే అవకాశం కలదన్నారు. ఈ యొక్క పథకం కాలపరిమితి రెండు సంవత్సరాలు మాత్రమేనని, ఈ పథకం కింద వడ్డీని ప్రతి మూడు నెలలకి ఒకసారి ఖాతాలో జమచేయబడుతుందన్నారు. మరన్ని వివరాలకొరకు మీ దగ్గర లోని పోస్ట్ ఆఫీస్ ని సంప్రదించాలన్నారు.

జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ కృషి మరులేనిది

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతూ అన్ని రంగాలలో మొదటి స్థానంలో నిలిపేందుకు జిల్లా కలెక్టర్‌గా ఎం.హరినారా యణన్ చేసిన సేవలు మరువలేనివి అని . రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయ ణస్వామి తెలిపారు. శనివారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి కలెక్టరును క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బదలీ పై వెళుతున్న జిల్లా కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టా త్మకంగా తీసుకుని చేపట్టిన అన్ని కార్యక్రమాల అమలు లో జిల్లా ను అగ్రస్థానంలో నిలపడం లో కలెక్టర్ కృషి మరువలేనిది అన్నారు. సంక్షేమ పథకాలుతోపాటు గృహనిర్మాణాలు, సచి వాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ నిర్మాణ పురోగతి తో పాటు అనేక పథకాలను అర్హులైన వారికి చేర్చడంలో ప్రభుత్వ ఆశయాలను ప్రతిబిం బించే విధంగా అధికారుల ద్వారా పనులు చేయించడంలో జిల్లా కలెక్టర్ గా ప్రత్యేక గుర్తింపు పొందారనీ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏ పథకం, ఏ అభివృద్ధి పనులు చేపట్టినా ముందుగా జిల్లాలో ప్రవేశపెట్ట డంతో పాటు ఆ పథకాలను అధికారుల ద్వారా మొదటిస్థానంలో నిలపడంజ రిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

అందరి సహకారంతో తిరుపతి అభివృద్ధి

: నూతన కమిషనర్ హరిత

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధి.కారు లు, ప్రజలందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అన్ని విధాలా కృషిచేయడం జరుగుతుందని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా భాధ్యతలు స్వీకరించిన దామలచెరువు హరిత అన్నారు. నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా భాధ్యతలు నిర్వహిస్తూ సాదారణ బదిలిపై తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా హరిత తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం భాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరం విస్తరించేందుకు అవసరమైన మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి కృషి చేయడంతో బాటు స్వచ్ఛ సర్వేక్షన్లో దేశంలో ఆదర్శవంతమైన నగరంగా తిరుపతిని తీసుకు రావడం జరుగుతుందన్నారు. తిరుపతి నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తామని, పరిశుభ్రతకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రజలకు అందివ్వడం జరుగుతుందన్నారు. తిరుపతి అన్ని విభాగాల్లో ఖ్యాతి పొందేలా అందరి సహకారంతో కృషి చేయడం జరుగుతుందన్నారు. తాను తిరుపతి నగరపాలక సంస్థలో గతంలో అదనపు కమిషనర్ గా పని చేయడం వలన నగరంపై పూర్తి అవగాహన వుందని, అదేవిధంగా నెల్లూరు మునిసిపల్ కార్పొరే షన్ కమిషనర్‌గా భాధ్యతలు నిర్వహించడం వలన వచ్చిన అనుభవంతో తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తానని హరిత తెలిపారు. నూతన కమిషనర్ గా భాధ్యతలు చేపట్టిన కమిషనర్ హరితకు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, కార్పొరేటర్లు, అధికారులు ప్రత్యేక అభినందనలు తెలిపి స్వాగతించడం జరిగింది.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - పాలసముద్రం : జగనన్నతోనే అభివృద్ధి సాధ్యమని మండల కన్వీనర్ తులసి యాదవ్ అన్నారు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు ఆయన పాలసముద్రం సచివాల పరిధిలో ఇంటి ంటికి తిరిగి కరపత్రాలు ఇస్తూ వైసీపీ చేసిన అభివృద్ధిని వివరించారు నవర త్నాల పథకాలతో పేదలను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అని ఏ రాష్ట్రంలో చేయినంతగా పేదల కోసం మన రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని ఆయన అన్నారు అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో కూడా వైసీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను ఆయన కోరారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అన్బేలగన్ వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్లూరు చర్చిలో ఈస్టర్ పండుగ మహోత్సవాలు

విశాలాంధ్ర- పులిచెర్ల-కల్లూరు:-పులిచెర్ల మండలం కల్లూరు బీసీ కాలనీ చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చర్చి పాస్టర్ కె.ధనరాజ్‌తెలిపారు. ఈసందర్భంగా చర్చి పాస్టర్ మాట్లాడుతూ ఆయన లోకాన్ని రక్షించుట కొరకు మరణాన్ని జయించారు. 40 రోజులు భూమ్మీద జీవించి ఆరోహణమయ్యారు. ఏసుక్రీస్తు పునర్థానము దినమున పురస్కరించు కొని ఈస్టర్ వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తాదులందరూ కలుసుకుని దేవుని శ్రుతించి ఆరాధించెదరు. భక్తులందరూ చర్చిని అలంకరి ంచి మన జీవి తాలను శరీరాలను శుభ్రపరచుకొని దేవుని మందిరానికి వెళ్లి దేవుని మహిమ పరచుటకు అందరూ సిద్ధపడుతున్నారు. ఈస్టర్ మహోత్స వాల సందర్భంగా ఆదివారం చర్చిలో ఆధ్యాత్మిక పాటలు, సందేశము, నాటికలు జరుగుతాయని అందరూ పాల్గొని దైవ కృప పాత్రులు కాగలరని ఆయన కోరారు.

రైతుల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో

అన్నదాన కార్యక్రమం

- చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

విశాలాంధ్ర - పాకాల : పంటలు పండించే రైతుల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో నియోజకవర్గ పరిధిలోని వారసంతలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చంద్రగిరి శాసనసభ్యులు చెవి రెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. పాకాల మండలంలోని దామలచెరువు వారపు సంతలో అన్నదాన కార్యక్రమాన్ని చెవిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో పండించిన పంటలను రైతులు సంతలకు తీసుకొని వచ్చి అమ్ముకుంటారని కాయగూరలు అమ్మే సమయంలో రైతులు పస్తులు ఉంటారన్నారు. పంటకు గిట్టుబాటు ధర లేని సమయంలో నీళు తాగి కడుపు నింపుకుంటారని తన దృష్టికి వచ్చిందని దీంతో పంటలు పండించే రైతులు వస్తువులు ఉండకూడదు అనే ఉద్దేశంతో వారపు సంతలలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నం పండించే రైతులకు ఆకలి తీర్చే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పద్మజా రెడ్డి, ఎంపీపీ లోకనాథం , వైస్ ఎంపీపీ నాగూర్ బి రహీం , సర్పంచ్ సునీత నాయకులు వినాయక, ఇమ్రాన్, హరి ,భాస్కర్ నాయుడు ,చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే అభివృద్ధి సాధ్యం

-బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-తొట్టంబేడు: తెలుగుదేశంతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చెప్పారు. 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమంలో భాగంగా మూడవ రోజైన శనివారం ఆయన తొట్టంబేడు మండలంలోని చిన్నసింగ మాల గ్రామంలో పర్యటించారు. స్థానికులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఇక ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ప్రజల సమస్యలు సావధానంగా వింటూ కొన్నింటిని అక్కడక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప... వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏ పని చేయలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసిన తారు రోడ్లు, సిమెంటు రోడ్లు, తాగునీటి ట్యాంకులు, పేదలకు పక్కా గృహాలు ఇవన్నీ కూడా తన తండ్రి హయాంలో చేసినవేనని ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన ఏ అభివృద్ధి పని చేయలేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పేదలకు అందే అనేక సంక్షేమ పథకాలు రద్దు చేసిందన్నారు. అర్హులైన వారికి కూడా అనేక కారణాలు చూపుతూ ప్రభుత్వ పథకాలు రద్దు చేశారని ఆయన ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తామ న్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని ఆయన కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి లాగా అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇక చిన్నసింగమాలలో ప్రచారం ముగిసిన తరువాత అదే గ్రామంలో క్లస్టరు, యూనిట్, బూతు, సెక్షన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం ఎలా పని చేయాలనే అంశంపై చర్చించారు. ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేసి టీడీపీని గెలిపించాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మండల అధ్యక్షులు గాలి మురళీనాయుడు, రావిళ్ల మునిరాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్ర తనిఖీలో వైద్యాధికారులు

విశాలాంధ్ర-చిల్లకూరు: చిల్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని హరిజనవాడ అంగన్వాడీ కేంద్రాన్ని వైద్యాధికారులు పాల్ జాన్సన్, భావనారాయణ , గర్భవతులకు, ఐరన్ మాత్రలు, సిరప్ లు ఎలా పంపిణీ చేస్తున్నారు అని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. సార్వత్రిక వ్యాధినిరోధక టీకాలను చెక్ లిస్టు ప్రకారం ఎలా వేస్తున్నారు అని గమనించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళారైతు కూలి దుర్మరణం

ముగ్గురికి తీవ్ర గాయాలు - ఒకరి పరిస్థితి విషమం

విశాలాంధ్ర-చిల్లకూరు: చేడిమాల గ్రామం సమీపంలోని మిరప తోటలో మిర్చి కోతపనికి కత్తి శారద తనతో పాటు నక్కలకాలువ ఖండ్రిగలోని మరో 9మంది మహిళారైతుకూలి లను తనకు తెలిసిన ఆటో డ్రైవర్ కత్తి శీనయ్య ఆటోలో శనివారం ఉదయం బయలుదేరి దారిలో మరో ఇద్దరిని ఎక్కించుకునేందుకు జాతీయ రహదారిపై వరగలి అడ్డ రోడ్డు సమీపంలోని పెట్రోలు బంక్ ఎదురు గా ఆటోను ఆపి ఉన్న సమయంలో నాయుడుపేట వైపు నుంచి తోకలారీ ఆటోను వెనుకనుండి మితిమీరిన వేగంతో అదుపు తప్పి బలంగా ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే కత్తి పోలమ్మ (42) దుర్మరణం చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. 5మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను టోల్ ప్లాజా అంబులెన్స్ లో గూడూరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం విషమంగా ఉన్న చొక్కల పోలమ్మ, మాడా సరోజనమ్మ , తుపాకుల సుబ్బమ్మ లను మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. కత్తి జయమ్మ, యలంపల్లి పద్మమ్మ , కత్తి వెంకటమ్మ, వి. శ్రావణి, కత్తి పార్వతి లు గూడూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన తోకలారీని చిల్లకూరు పోలీసు స్టేషన్ లో పెట్టి, డ్రైవర్ పారిపోయాడు. ఎస్సై బి. గోపాల్ కత్తి పోలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి , కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితుల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు

దళితులపై దాడులు చేయడం తగదు : అఖిలపక్షం

విశాలాంధ్ర - తిరుపతి : సిపిఐ, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దళితులు, మైనారిటీలు, మహిళలపై దాడులు అను అంశంపై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం శనివారం ఉ.10.30కి గంధమనేని శివయ్య భవన్లో చిన్నం కాలయ్య అధ్యక్షతన జరిగినది. అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి దలితులపై దాడులు పెరిగాయని డాక్టర్ సుధాకర్, డాక్టర్ రజినిలు వైద్య పరికరాల కొరతను ఎత్తిచూపారని కక్షగట్టి వారిపై దాడులు చేసి వారిని మానసికంగా హింసించి దాడి చేసి చంపిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కిందని నేడు డాక్టర్ అచ్చన్న మరణానికి కారణమైన వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దుశ్చర్యలను మానుకోవాలని ఈనెల 11వ తేదీన దళిత, మైనారిటీ, మహిళల పై దాడులను నిరసిస్తూ చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. టిడిపి తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు నరసింహ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని దానితో వైసిపి దాడులకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ఈ ప్రభుత్వాల మనుగడలో సామాన్యులకు న్యాయం జరగదని, ప్రధానంగా దళితుల ఓట్లతో అధికారం చేజిక్కించుకున్న వైసిపి దళితులనే టార్గెట్ చేసి దాడులు చేయటం దుర్మార్గమన్నారు. మాజీ రాష్ట్ర మంత్రులు పరసాంత్నం మాట్లాడుతూ చట్టసభల్లో వామపక్షాలు లేని లోటు స్పష్టంగా కనిపిస్తున్నదని అప్రజాస్వామికి మైనటువంటి వ్యవస్థ నడుస్తున్నదని ఇలాంటి వాటికి చమర గీతం పాడాల్సిన అవసరం ఉందని ఈ క్రమంలో సాగే వామపక్ష ఉద్యమాలకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. రైతు ఉద్యమ నాయకులు మాగంటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని మలినం చేస్తున్నారని మహిళలు పై దళితులపై విచక్షణ రహితంగా దాడులు చేయడం సభ్య సమాజం తలదించుకునేలా బిజెపి వైసిపి వ్యవహరిస్తుందని అంటరానితనాన్ని అంతమెం దించడానికి అఖిలపక్ష పార్టీలు కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎన్ నగేష్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి వచ్చిన నాటి నుంచి దళితుల మీద దాడులు నిత్య కృత్యమయాయని కక్షపూరిత మైనటువంటి రాజకీయాలు చేస్తూ ప్రజాసామ్యాన్ని ఖూనీ చేస్తున్నది అన్నారు. భారతీయ దళిత సాహిత్య అకాడమీ నాయకులు డా.ధనశేఖర్ మాట్లాడుతూ రిజర్వేషన్ అమలు జరగటం లేదని ఆర్థికంగా నైతికంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని ఏం తినాలా ఏం బట్ట కట్టుకోవాలో నిర్దేశించే స్థాయిలో ప్రభుత్వాలు నడుస్తున్నాయని లౌకిక వ్యవస్థకుమాయని మచ్చగా బిజెపి ప్రభుత్వ విధానం ఉందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్ మాట్లాడుతూ దళితులకు ఉన్నత విద్యను దూరం చేసే పనిలో రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఇంతకన్నా దళితులపై ఆర్థికమైన దాడి మరే ఉంటుందని ఇలాంటి ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏపీ మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి నదియా మాట్లాడుతూ మహిళలపై దాడులు అరికట్టడానికి నిర్భయ, దిశ చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదని, అగ్రవర్ణలవారు దళిత యువతులను ప్రేమ పేరుతో మోసం చేస్తున్నారని, ఇలాంటి సంఘటనలను నివారించడంలో పోలీస్ వ్యవస్థ పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నదని అన్నారు. మహిళల చట్టాలు సక్రమంగా అమలు చేయకపోవడంతో మహిళలపై దాడులు జరుగుతున్నాయా అన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న పెంచలయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వి ఉదయ్ కుమార్, దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారేళ్ల శ్రీనువాసులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి జింక నాగరాజు, ఎ. పి చేతి వృత్తిదారుల సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి డి రామచంద్రయ్య, డి హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు బి నాగభూషణం, డా.ఆర్ బలరాం, ఏఐటీయూసీ నాయకులు ఎండి రవి, కేవై రాజా, ఎస్.శివ, కె. గోవిందస్వామి, మహిళా నాయకులు సి. రత్నమ్మ, ప్రమీల, విజయ, హరిత అఖిల అలివేలమ్మ, సావిత్రి, విద్యార్థి నాయకులు ప్రవీణ్, వినయ్, బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పోటా పోటీగా టిడిపి, వైసిపి అన్నదాన కార్యక్రమాలు

వారపు సంతల సాక్షిగా మొదలైన ఓట్ల వేట - అభ్యర్థిత్వాలు ఖరారు కావడంతో గెలుపు కోసం ముమ్మర ప్రయత్నాలు

సంవత్సరం మునుపే కనిపిస్తున్న ఎన్నికల వాతావరణం

విశాలాంధ్ర - పాకాల : చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నికల కు ఇంకా సంవత్సరం ఉండగానే ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. శనివారం పాకాల మండలం దామలచెరువులోని వారపు సంతలో నిర్వహించిన పోటాపోటీ అన్నదాన కార్యక్రమాలు చూస్తే ఎవరికైనా ఈ సందేహం కలగక మానదు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని వారపు సంతల లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని శనివారం దామల చెరువు వారపు సంత నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. గత ఎన్నికలకు మునుపు ఇదేవిధంగా వారపు సంతలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. . ఈ విషయాన్ని తెలుసుకున్న టిడిపి నాయకులు తాము సైతం అంటూ శనివారం దామల చెరువు వారపు సంతలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇదేవిధంగా ప్రతి వారపు సంతలోను అన్నదాన కార్యక్రమం నిర్వహించే ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం. హఠాత్తుగా వారపు సంతకు వచ్చే వ్యాపారులు ,ప్రజలపై ప్రేమ పుట్టుకు రావడానికి ఎన్నికలు సమీపిస్తుండటమే కారణమని ప్రజలు భావిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో అధికార ప్రతిపక్ష పార్టీల తరఫున ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఖరారు కావడంతో గెలుపు కోసం ఇప్పటినుండే ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఒకవైపు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నియోజకవర్గం వ్యాప్తంగా పాదయాత్ర చేస్తుండగా, పులివర్తి నాని త్వరలోనే మీ ఇంటికి మీ పులివర్తి నాని పేరుతో నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించేందుకు కార్యక్రమం ఖరారు చేసుకున్నారు. దీంతో చంద్రగిరి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలకు ఏడాది మునిపే ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి డివిజను పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఆపేస్తున్నట్లు ఆశాఖఈఈఎన్.వాసురెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, కేవీబీపురం, ఏర్పేడు మండలాల పరిధిలో విద్యుత్ సరఫరా ఆపేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అంతరాయం గుర్తించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'అక్రమాలకు పాల్పడ లేదు'

-చౌక దుకాణపు డీలరు బుజ్జమ్మ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రభుత్వ చౌక దుకాణంలో రేషన్ బియ్యం పక్కదారి పట్టించి తాను అక్రమాలకు పాల్పడటం లేదని శ్రీకాళహస్తి మండలం టీఎంవీకండ్రిగ డీలరు బుజ్జమ్మ చెప్పారు. విశాలాంధ్రలో శనివారం 'రేషన్ బియ్యం బొక్కేస్తున్నారు..!' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనంపై ప్రభుత్వ చౌక దుకాణపు డీలరు బుజ్జమ్మ స్పందించి 'విశాలాంధ్ర'తో మాట్లాడారు. తాను అక్రమంగా రేషన్ బియ్యం విక్రయిస్తున్నట్లు కొందరు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కార్డుదారులకు అందరికీ బియ్యం ఇస్తున్నట్లు చెప్పారు. వివాహం అయి వెళ్లి పోయిన వారికి... చని పోయిన వారికి బియ్యం ఇవ్వడం లేదన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన డీలరు 38 బస్తాల బియ్యం, ఒక బస్తా చక్కెర, ఒక బస్తా రాగులు తనకు అప్పగించలేదన్నారు. ఆ డీలరే ప్రస్తుతం తనపై ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. అధికారులు ఈ విషయం గుర్తించాలని బుజ్జమ్మ విజ్ఞప్తి చేశారు.

రాజేష్ గురుకుల్ ఉగాది నంది పురస్కారం

- అలంకార చక్రవర్తి బిరుదుతో సత్కారం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి వాస్తవ్యులు రాజేష్ గురుకుల్ ఉగాది నంది పుష్కారముతోపాటు అలంకార చక్రవర్తి బిరుదు అందుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణముకు చెందిన శ్రీకాళహస్తి దేవస్థాన అభిషేక గురుకుల్ శ్రీ స్థానం రాజేష్ గురుకులకి ఉగాది నంది పురస్కారం వరించింది. హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాజ గాన సభలో శిఖరం ఆర్ట్స్ థియేటర్ వారి ఆధ్వర్యంలో శ్రీ శోభాకృత్ నామ సంవత్సర ఉగాది నంది పురస్కారాలలో భాగంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అభిషేక గురుకుల శ్రీ స్థానం రాజేష్ గురుకుల్‌కి ఉగాది నంది పురస్కారముతోపాటు అలంకార చక్రవర్తి అనే బిరుదు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య సలహాదారుడు, రాష్ట్ర టూరిస్ట్ డెవలప్మెంట్ చైర్మన్ శ్రీనివాస గుప్తా, జనగామ జిల్లా కలెక్టర్ అరుగి రెడ్డి, వేద పండితులు వెల్లంకి కృష్ణ శర్మ, శివ కార్తీక్ శాస్త్రి తదితరుల చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరిగినది. రాజేష్ గురుకుల్ ఉగాది నంది పురస్కారం, అలంకార చక్రవర్తి బిరుదు అందుకోవడం పట్ల శ్రీ కాళహస్తి దేవస్థానం ఉద్యోగులు, పండితులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

తెలుగుదేశం పార్టీలో చేరిన మహజనసైన్యం

విశాలాంధ్ర-చిల్లకూరు: మహాజనసైన్యం వ్యవస్థాపకులు చేవూరు సురేంద్ర , బలిజ సంక్షేమ సంఘం మద్దాలి శ్రీనివాసులు, పట్నం శ్రీరాములు, కత్తి సురేష్ తదితరులు తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు నాయుడు చేతుల మీద కండువాలు వేసుకుని చేరారు. పార్టీ పటిష్టతకు , పూర్వవైభవానికి తమ వంతు కృషి చేస్తామని , చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవి చేపట్టేందుకు తాము చేయగలిగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్న వైసీపీ ప్రభుత్వం : సిపిఐ

విశాలాంధ్ర - సుళ్లూరుపేట : ప్రజాస్వామ్య హక్కు కాలరాయడం ద్వారా వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నదని సిపిఐ సూళ్లూరుపేట నియోజకవర్గ కార్యదర్శి సి సుధాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప పశుసంవర్ధక శాఖలో డిడి గా పనిచేస్తున్న డాక్టర్ అచ్చన్న మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో భావ ప్రకటనా స్వేచ్ఛను రాష్ట్ర ప్రభుత్వం హరిస్తున్నదని, ప్రజాందోళనలను నియంత్రించడం ద్వారా పై చేయి సాధించాలని చూస్తే ప్రజలు తప్పక గుణపాఠం చెబుతారన్నారు. డాక్టర్ అచ్చన్న మృతికి అతను సుపీరియర్ ఆఫీసర్స్ మరియు సబార్డినేట్స్ ప్రోద్బలమే బలంగా ఉందని, ఇందులో రాష్ట్రస్థాయి అధికారులు కూడా భాగస్వామ్యం కావడం అనేక అనుమానాలకు తావిచ్చేలా పోలీసుల తీరు ఉందని అందుకనే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడం ద్వారా నిజాలు నిగ్గు తేల్చాలని, అచ్చన్న కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గారిని భేషరతుగా విడుదల చేయాలని కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో సిపిఐ సూళ్లూరుపేట నియోజకవర్గ సమితి సభ్యులు నాగేంద్రబాబు వినోద్ కుమార్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండల పరిధిలో బంగారమ్మకాలనీలో గల సంకట విమోచన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు రామాంజులు, విద్యావతి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ పూజారి ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా కలశ స్థాపన చేసి... ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామి అమ్మవార్లకు బాసికం, కంకణ ధారణలు, గావించి మంగళ సూత్రానికి పూజలు నిర్వహించి జీలకర్ర బెల్లం స్వామి అమ్మవార్ల శిరస్సున ధరింపజేసి శాస్త్రోక్తంగా మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు, వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం చేశారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా కామ్రేడ్ ఓంప్రకాష్‌గుప్తా 101వ జన్మదినం వేడుకలు

విశాలాంధ్ర - తిరుపతి : కామెడి ఓం ప్రకాష్ గుప్తా గారి 101వ జన్మదిన వేడుకలు చాలా వైభవంగా నేషనల్ ఫెడరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ బిఎస్ఎన్ఎల్ యూనియన్ ఆఫీసు నందు గుప్తా గారి ఫోటోకు పూలమా లవేసి కేక్ కట్ చేయడం జరిగినది ఈ కార్యక్రమమునకు ఏఐటీయూసీ తిరుపతి నగర కార్యదర్శి ఎస్ డి రవి జిల్లా ఉపాధ్యక్షులు కర్ల పూడి గోవిందస్వామి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైనారు మాట్లాడుతూ ఓం ప్రకాష్ గుప్తా గారి బిఎస్ఎన్ఎల్ మరియు పోస్టల్ ఉద్యోగులకు అతని సేవలు మరవరానిది అతని 101వ జన్మదినానికి బిఎస్ఎన్ఎల్ నుండి ఎక్కువ సంఖ్యలో పాల్గొనడమే అతని పైన ఉన్న ఆలోచన విధానము గొప్పదని తెలియజేశారు కర్లపూడి గోవిందస్వామి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతి జిల్లా మాట్లాడుతూ టెలికంలో లక్షలాది మందిని ప్రత్యేకంగా పాతం ఎంప్లాయిస్ రెగ్యులరైజేషన్ ముందు చూపించండి వారి సర్వీస్ అనుసరించి చేయడం జరిగింది ఓం ప్రకాష్ గుప్తా గారు పోస్టల్ అండ్ టెలికం డిపార్ట్మెంట్లో ఇంజినీరింగ్ ఎంప్లాయిస్ మరియు క్లాస్ ఫోర్ అలాగే పోస్టల్ టెలిగ్రాఫ్ రైల్వే మెయిల్ గార్డ్ మొదలగు సెక్షన్ లో పనిచేసే ఉద్యోగస్తులు అందరికీ సెక్రటరీ జనరల్ గా పనిచేశారు అతని ముందు చూపు విధానం నే బిజెపి ప్రభుత్వం 2020 అక్టోబర్ పబ్లిక్ సెక్టార్ చేయడం జరిగినది అప్పుడు చేసిన చర్చల ఫలితమే ఈరోజు పెన్షన్ విధానము ఫైనాన్సువాబిలిటీ జరిగినది కావున ఓం ప్రకాష్ గుప్తా గారి ముందుచూపు చర్య మరువరానిది అని కొనియాడారు ఈ కార్యక్రమమునకు జిల్లా అధ్యక్షులు మరియు సెంట్రల్ వర్కింగ్ కమిటీ ఉపాధ్యక్షులు రఘుపతి జిల్లా అసిస్టెంట్ జిల్లా సెక్రెటరీ ధనంజయుడు మహిళా ఉద్యోగులు మరియు ఉద్యోగస్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు ఏఐటీయూసీ నగర సమితి తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాం.

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ

విశాలాంధ్ర - ఏర్పేడు : శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలోని తన స్వగ్రామమైన మన్నసముద్రం గ్రామంలో "జగనన్నే మా భవిష్యత్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంచుతూ అందరికీ సంక్షేమ పథకాలు సరిగా అందుతున్నాయా, మళ్ళీ జగనన్న ముఖ్యమంత్రి అయ్యేందుకు మద్దతు ఇస్తా రా అని తెలుసుకొని వారి స్పందనను నమోదు చేశారు. అనంతరం వారి అనుమతితో వారి ఇంటికి "జగనన్నే మా భవిష్యత్" స్టిక్కర్లను అతికించారు. మళ్ళీ సంక్షేమ సారథి జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయాని లేని పక్షంలో ఆగిపోతాయాని ఆయన అన్నారు.

ఘనంగా నలంద పాఠశాల "స్నాతకోత్సవం"

విశాలాంధ్ర - తిరుపతి : నలంద ఉన్నత పాఠశాల కొత్తపల్లి నందు "స్నాతకోత్సవం" కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు విచ్చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వం విద్యాసంస్థల అధినేత, అప్పుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి,రవీంద్ర భారతి విద్యాసంస్థల అధినేత బీ. రవీంద్రనాథ్ రెడ్డి, బ్రిలియంట్ హై స్కూల్ కరస్పాండెంట్ జీ.ఓం ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. వారు ఉపన్యసిస్తూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా నలంద హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఓబుల. వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి జీవితం అద్భుతమైనదని క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థిని విద్యార్థులను కోరారు. డైరెక్టర్ ఓ. ఆనంద రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మీరు అనుకున్న గమ్యాన్ని సాధించడానికి క్రమశిక్షణ చాలా అవసరమని తెలిపారు.

అంబేద్కర్ జయంతికి ప్రతి ఒక్కరికి ఆహ్వానం

విశాలాంధ్ర - పెళ్లకూరు : మండలం లో కానూరు గ్రామము లో ఈ నెల 14 వ తేదీన కానూరు అంబెడ్కర్ విగ్రహం దగ్గర అంబెడ్కర్ యూత్ ఆధ్వర్యం లో అంబెడ్కర్ జయంతి కార్యక్రమం జరుగుతుంది. అందుకుఅని ఈ అంబెడ్కర్ విగ్రహం నకు ముందుగా పెయింట్ వేసి అంబెడ్కర్ విగ్రహం ను అలంకరించడం జరిగింది. ఈ సందర్భంగా కానూరు అంబెడ్కర్ యూత్ అధ్యక్షుడు సంక్రాంతి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏప్రిల్ 14 వ తేదీన కానూరు లో అంబెడ్కర్ జయంతి కార్యక్రమం ఘనంగా జరుగుతుంది. ఆ రోజు ప్రముఖ అంబెడ్కరిస్ట్ లు ను కానూరు కి పిలిపించి యువత కు అంబెడ్కర్ ఆశయాలు లక్ష్యాలు ను గురించి తెలియచేస్తారు . చదువు యొక్క ప్రాముఖ్యత ను విద్యార్థులు కు యువత కు తెలియచేస్తారు . అని తెలియ చేసేరు. ఈ జయంతి కార్యక్రమం నకు కానూరు యువత, గ్రామస్తులు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్నారు అని తెలియచేయడం జరిగింది.